## క్లుప్తంగా

### ఆలయంలో వార్షికోత్సవ పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరుడు

**పెనగలూరు :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం స్వామివారిని ఊరేగించారు.

### జగనన్న గోరుముద్దను తనిఖీ చేసిన ఎంఈఓ



రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న ఎంఈఓ శంకరయ్య

**సిద్దవటం :** మండల పరిధిలోని ఎస్.రాజంపేట గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ శంకరయ్య జగనన్న గోరుముద్దను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరాతీశారు. భోజనం నాణ్యతగా ఉందా లేదా అని పరిశీలించారు. అంతేగాకుండా జగనన్న గోరుముద్ద రిజిస్టర్‌తోపాటు విద్యార్థుల రిజిస్టర్లను తనిఖీ చేశారు.

### పాఠశాలకు కుర్చీల బహూకరణ



పాఠశాలకు కుర్చీలు బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

**రైల్వేకోడూరు అర్బన్ :** పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు బాలాజీ, నేతాజీ, విజయమ్మలు బుధవారం పాఠశాల అభివృద్ధిలో భాగంగా సౌకర్యాల కల్పనకు 15 కుర్చీలు, వంట మనుషులకు నాలుగు స్టూళ్లను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎస్ ఆర్‌జేసీ, ట్రిపుల్ ఐటీ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయం సాధిస్తే మొదటి ఐదు మందికి ఒక్కొక్కరికి రూ.10వేలను అందజేస్తామని చెప్పారు. త్వరలోనే పాఠశాలకు ఆర్‌ఓ సిస్టంను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి– 2 సుందర్ బాబు, హెచ్ఎం వెంకటరమణ, పీఈటీ రాధ, ప్రదీప్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సు లారీ ఢీ



బస్సు అద్దాలు పగిలిన దృశ్యం

**ఓబులవారిపల్లె :** మండలంలోని చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై బుధవారం లారీ, ఆర్టీసీ బస్సు ఢీ కొన్నాయి. దీంతో బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చెన్నై వైపునకు వెళుతున్న లారీని కడపకు వెళుతున్న నాన్‌స్టాప్ ఏసీ డీలక్స్ ఆర్టీసీ బస్సు వేగంగా ఢీ కొంది. బస్సు మధ్య భాగంలో కిటికిల అద్దాలు ధ్వంసమైయ్యాయి. అద్దాలు తగిలి పలువురి ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు పెద్దఎత్తున ప్రమాద స్థలికి చేరుకొని, సహాయ చర్యలు చేపట్టారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకొన్నారు. ఇటీవల ఇదే తరహాలో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొనడంతో ఐదు మంది మృతి చెందారు. అతి వేగం కారణంగా ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

### మాజీ సర్పంచ్ వేల్పుల లక్ష్మిదేవి మృతి



**నందలూరు(రాజంపేట) :** నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ వేల్పుల లక్ష్మిదేవి(73) మృతి చెందారు. 2002 ప్రాంతంలో సర్పంచ్‌గా నాగిరెడ్డిపల్లెలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న లక్ష్మిదేవి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, ఆమె కుమారుడు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు వేల్పుల శైలకుమార్‌ను పరామర్శించారు. గురువారం అంత్యక్రియలు జరుగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# చంద్రయాన్ సంబరాలు

అంతరిక్ష రంగంలో ఇస్రో కొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్–3 విజయవంతం కావడంతోపాటు చంద్రుడి దక్షిణ ధృవంపై రోవర్‌ను దింపిన మొదటి దేశంగా రికార్డులకు ఎక్కింది. చంద్రయాన్ విజయంతో సంబరాలు అంబరాన్నంటాయి. కాగా రాయచోటిలో చంద్రయాన్ విజయం సాధించాలని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, మూడు నియోజకవర్గాల పరిధిల్లోని పలు పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యక్ష ప్రసారాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనగలూరు: చంద్రయాన్ విజయవంతంపై ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

**దేశ ఖ్యాతిని పెంచింది**



చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంపై ఇస్రో శాస్త్రవేత్తలకు అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. బుధవారం చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరుకొన్న మొదటి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం ద్వారా దేశ ఖ్యాతిని పెంచిన ఇస్రో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలిపారు.



రాయచోటి అర్బన్ : చంద్రయాన్–3 విజయవంతం కావాలంటూ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాజంపేట టౌన్: చంద్రయాన్–3 విజయవంతంతో క్రీడాకారుల సంబరం



గాలివీడు: చంద్రయాన్–3 ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు



రైల్వేకోడూరు: అయ్యవారిపల్లె పాఠశాలలో చంద్రయాన్ ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు



సంబేపల్లె మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో

## కమనీయం వేంకటేశ్వరుడి కల్యాణం

**రాజంపేట టౌన్ :** మండలంలోని వెంకటరాజంపేట గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకుడు మహేష్ నేతృత్వంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రోచ్చారనలతో కమనీయంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ఉట్టికొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మూర్తులకు పురవీధుల్లో ఊరేగించారు.

## స్విమ్స్ మాజీ డైరెక్టర్ వెంగమ్మ సేవలు ప్రశంసనీయం

**రాజంపేట :** తిరుపతి స్విమ్స్ మాజీ డైరెక్టర్ వెంగమ్మ సేవలు ప్రశంసనీయమని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. బుధవారం ఏఐటీఎస్‌లో మహిళలకు సమానత్వంతోనే అందరికీ ప్రగతి అనే అంశంపై అవగాహన సదస్సుకు హాజరైన వెంగమ్మను ఘనంగా సన్మానించి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు వెంగమ్మను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తిరుపతిలో వైద్య పరంగా వెంగమ్మ తనకుంటూ ఒక గుర్తింపును సాధించుకున్నారన్నారు. విద్యార్థి దశ నుంచి మహిళలు లక్ష్యాలను పెట్టుకొని ముందుకెళ్లాలన్నారు. తిరుపతి స్విమ్స్ మాజీ డైరెక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పోలిస్తే అన్ని రంగాలలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రతి ఒక్క మహిళా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను



వెంగమ్మను సన్మానిస్తున్న చొప్పా గంగిరెడ్డి

పెట్టుకొని పురుషులతోపాటు సమానంగా రాణించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. మహిళలు తాము ఎంచుకున్న రంగాలలో రాణించాలంటే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, డీన్ సుబ్బారావు, హెచ్ఓడీ పద్మలలిత పాల్గొన్నారు.

## బెటాలియన్‌లో టంగుటూరి జయంతి

**సిద్దవటం :** మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని కమాండెంటు ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన దేశానికి చేసినటువంటి సేవల గురించి కొనియాడారు. అడిషనల్



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు

కమాండెంటు కె.ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, వి.జయప్రసాద్, కె.వెంకట్‌రెడ్డి, పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో పారిశుధ్య పనులు

**ఓబులవారిపల్లె :** చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గద్దె సిద్దమ్మ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఎక్కువగా ఉండి విష పురుగులు తిరుగుతున్నాయని పాఠశాల నిర్వాహకులు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు రూపానందరెడ్డికి తెలిపారు. ఆయన వెంటనే స్పందించి పాఠశాలలో పిచ్చిమొక్కలను తొలగించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వసతి భవనం నిర్మాణ పనులు ప్రారంభం

**రాయచోటి టౌన్ :** రాయచోటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో వసతి భవనం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో పనులు ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వసతి గృహాలను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని వారు తెలిపారు.

## ముస్లిం ఐక్య వేదికకు హాజరుకండి



ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

**రాయచోటి టౌన్ :** ఈనెల 27వ తేదీన గంటూరు పట్టణంలోని పొన్నూరు రోడ్డులో ఉన్న 'బి' కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ముస్లిం ఐక్య వేదికకు హాజరు కావాల్సిందిగా నిర్వాహకులు రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ మయాన్ జకియాఖానంను ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నిర్వహకులు సలావుద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ సారథి సీఎం జగన్

**చిట్వేలి :** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించి దేశంలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా గుర్తింపు పొందారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తిమ్మయ్యగారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని చిల్లావాండ్లపల్లి, హరిజనవాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్తూ అందరినీ పలుకరిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సమస్యలను, వినతులను స్వీకరిస్తూ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తూ నాడు – నేడు పనులను పరిశీలిస్తూ ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసుల రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, రమణారెడ్డి, లింగం లక్ష్మీకర్, సర్పంచ్ జయరామిరెడ్డి, నరసింహులు, తహసీల్దార్ శిరీషా, ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ**

**రైల్వేకోడూరు :** మండలంలోని ఎస్.ఉప్పరపల్లెలో



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, ప్రజాప్రతినిధులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేలా కృషి చేస్తూ కమ్యూనిటీ భవన్ నిర్మాణం చేపట్టామన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో పదికాలాలపాటు మన్నికగా నిలిచే విధంగా చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌తోపాటు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ వైఎస్ అన్వర్‌బాషా, చెంగల్‌రెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, దమ్ము రఘు, శంకర, అంజి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల ప్రయోజనల సంరక్షణే ట్రాయ్ లక్ష్యం

**గాలివీడు :** వినియోగదారుల ప్రయోజనాల సంరక్షణే ట్రాయ్ లక్ష్యమని టెలి కమ్యూనికేషన్ వినియోగదారుల అవగాహన సదస్సులో బీఎస్ఎన్ఎల్ అధికారులు జేటీఓ ఎస్.శివప్రసాద్, జేఈఓ బి.వి. సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని సీసీపల్లెలో ట్రాయ్ న్యూఢిల్లీ సౌజన్యంతో సీఏజీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ట్రాయ్ కమ్యూనికేషన్ రంగంలో వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం టెలికాం నియంత్రణ సంస్థ ప్రధాన బాధ్యతలో ఒకటని సీఏజీ సభ్యులు తెలిపారు. మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో దూరవాణి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ట్రాయ్ గణాంకాల ప్రకారం రూ. 117.1 కోట్ల మంది వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. ట్రాయ్ వినియోగదారులకు ఉచితంగా అం



వినియోగదారుల ప్రయోజనాలపై మాట్లాడుతున్న శివప్రసాద్

దిస్తున్న మైకాల్ యాప్, మై స్పీడ్ యాప్, డు నాట్ డిస్టర్బ్ యాప్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిషోర్‌రెడ్డి, నాగబసిరెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, వినియోగదారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చౌకదుకాణం డీలర్లు పాల్గొన్నారు.

## లంకమల అభయారణ్యంలో కూంబింగ్

**సిద్దవటం :** సిద్దవటం రేంజ్ పరిధిలోని లంకమల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లోని మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు సిద్దవటం బీటులోని ఎద్దుల గుండాలు, కపర్దీశ్వరుని కోన, కొండూరు బీటులోని కుక్కల గుంతలు, గోపాలస్వామి ఆలయం రస్తా, కలివికోడి ఆవాస ప్రాంతాల్లో తమ సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎర్రచందనం స్మగ్లర్‌ల కదలికలు ఎక్కడా కనిపించలేదన్నారు. వన్యప్రాణులను వేటాడటం నిషేధమన్నారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడినా, చంపినా అట్టి వారిపై కఠిన



ఎద్దుల గుండాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, ఫారెస్టు బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రాజంపేట రూరల్ :** రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని రాజంపేట మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలోని పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ వై.సుజామని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నారంరాజుపల్లి (ఎస్–87), హేమాద్రివారిపల్లి (ఎస్–91), గంగిరెడ్డిపాళెం (ఈడబ్ల్యూఎస్–82), సీతారామపురం (బీసీ–బీ–60)లలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, చింతలకోన (ఓసీ–06)లో మిని అంగన్‌వాడీ, హేమాద్రివారిపల్లి(ఎస్–172), వైబీఎన్‌పల్లి (బీసీ–ఏ–170), సరస్వతీపురం (ఎస్సీ–177), చాపలవారిపల్లి(బీసీ–ఏ–179)లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలియజేశారు. అర్హత ఉన్న వారు ఆగస్టు 31 తేదీ సాయంత్రం 5గంటలలోపు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

**వీరబల్లె మండలంలో..**

**వీరబల్లె (రాయచోటి టౌన్) :** మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూపర్‌వైజర్ సరస్వతమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరబల్లె – 1లో ఆయా పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే సానిపాయి కొత్తపేట, వంగిమళ్ల బలిజపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా సుండుపల్లె మండల కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

**సంబేపల్లె :** మండల పరిధిలోని దేవపట్ల గ్రామంలో వెలసిన దేవపట్లమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులను బుధవారం ప్రాంభించినట్లు గుత్తేదారు వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అతి పురాతనమైన ఈ ఆలయం శిథిలావస్థ స్థితిలో ఉందన్నారు. ఆలయ పునః నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి దేవదాయశాఖ నుంచి కోటి రూపాయల నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ క్రమంలో



ఆలయ మండపాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

ఆలయానికి సంబంధించిన పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# కార్పొరేట్ బడులు చిన్నబోయేలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత
- నాడు – నేడుతో మారుతున్న బడుల రూపురేఖలు
- గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం

| | |
|---|---|
| సంబేపల్లె మండలంలోని పాఠశాలలు మొత్తం | 75 |
| నాడు - నేడు కింద నిధులు మంజూరైన పాఠశాలు | 39 |
| కేటాయించిన నిధులు రూ. కోట్లు | 6.41 |
| మొత్తం ఉపాధ్యాయులు | 240 |
| మొత్తం విద్యార్థులు | 4603 |



నాడు-నేడుతో రూపురేఖలు మారిన దేవపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం

**సంబేపల్లె :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండి విద్యను అభ్యసించాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి సాకార రూపమే మన బడి నాడు – నేడు పథకం. అనుకున్నదే తడవుగా కోట్ల రూపాయలు కేటాయించి పాఠశాలలో వసతుల లేమి నుంచి కలిమి వరకు నాణ్యతలో రాజీ పడకుండా పనులను పూర్తి చేసి కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. మండల వ్యాప్తంగా మొదటి, రెండవ విడత నాడు – నేడు కార్యక్రమంలో పాఠశాలలకు అవసరమైన సదుపాయాలతోపాటు ఆధునాతన వస్తు సామగ్రిని పాఠశాలలో పొందుపరుస్తున్నారు. విద్య ప్రభుత్వ బాధ్యత కాదన్న వారికి కనువిప్పు కలిగేలా పాఠశాలల రూపరేఖలను మార్చి సదుపాయాలు కల్పించారు.

**సదుపాయాలతోపాటు బాగోగులు చూస్తూ..**

విద్యను అభ్యసిస్తున్న వారికి సదుపాయాల కల్పనకు తోడు జగనన్న విద్యాకానుక ద్వార బ్యాగ్, బూట్లు, సాక్సులు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఆంగ్ల నిఘంటువు, వర్క్‌బుక్స్, యూనిఫామ్, బెల్ట్‌లు అందజేస్తున్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టిక



విద్యార్థులకు డిజిటల్ పాఠాలను బోధిస్తున్న పాఠశాల హెచ్ఎం

ఆహారాన్ని అందించేందుకు రోజుకో మెనూ అమలు చేస్తున్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావను విద్యార్థులకు అందిస్తున్నారు. డిజిటల్ విద్యను చేరువ చేయడంలో భాగంగా ట్యాబ్‌లు, పెద్దపెద్ద మానిటర్స్‌లో పాఠ్యాంశాల బోధనలతో తరగతి గదులు నిర్వహిస్తున్నారు. తరగతి గదుల్లో పంకాలు, తగినంత వెలుతురును ఇచ్చే విద్యుత్ లైట్లు, చక్కటి వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించి వాటి శుభ్రతకు పారిశుధ్య కార్మికులను నియమించారు. విద్యార్థులకు తాగడానికి శుద్ధ జలాన్ని అందించేందుకు నీటి శుద్ధి యంత్రాలను వినియోగంలోకి తెచ్చారు. పాఠశాల ప్రాంగణాన్ని చెట్లతో చూడ చక్కగా తీర్చిదిద్దారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ను తీసుకెళుతున్న విద్యార్థులు



తరగతి గదిలో ఏర్పాటు చేసిన బల్లలు



పాఠశాల ఆవరణలో పెంచిన మొక్కలు